సామాజిక పింఛన్ల పంపిణీ


పోతేపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

కోనేరుసెంటర్: మండలంలో 96.6 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. మండలానికి సంబంధించి సుమారు 12,106 మంది ప్రభుత్వం నుంచి వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు నిర్వహించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన కొద్దిసేపటికే సర్వర్ మొరాయించటంతో సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు అయోమయంలో పడ్డారు. లబ్ధిదారులు అనేక మంది సర్వర్ మొరాయిస్తుందని తెలియటంతో పింఛన్లకోసం కోసం చాలా సేపు టెన్షన్ పడాల్సివచ్చింది. మొత్తానికి రాత్రి 8.20 గంటల సమయానికి మండలంలో 12,106 మంది పింఛన్‌దారులు ఉండగా దాదాపు 96.5 శాతం మందికి అందజేసినట్లు ఎంపీడీవో బాలకృష్ణారావు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పోతేపల్లిలో పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేశారు.

నగరంలో 95.71 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛను పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. నగరంలో మొత్తం 18,962 పింఛన్లు ఉండగా రాత్రి 7 గంటల సమయానికి 18,149 పింఛన్లను ఇంటింటికీ అందజేశారు. ఇంకా 813 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. 95.71 శాతం పంపిణీ పూర్తయ్యింది. సచివాలయాల్లో పనిచేస్తున్న 390 మంది సెక్రటరీలు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. కార్యదర్శులతో పాటు ఆయా డివిజన్లలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి పింఛన్లు పంపిణీ చేయించారు.

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. గాంధీపురం ఎస్టీ కాలనీలో బుద్ధప్రసాద్, జనసేన యువనాయకుడు మండలి వెంకట్రామ్ (రాజా) వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), జనసేన, టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ముమ్మరంగా సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. పోసినవారిపాలెంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి, అన్నం హరి రామకృష్ణ, గోపి నాగబాబు, దాసరి సాయిరామ్, ఎంపీడీవో ఎన్.ప్రేమాన్విత, తహసీల్దార్ ఎస్ఎస్. శాంతి తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక/కృత్తివెన్ను: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నాగాయలంక, కృత్తివెన్ను మండలాల్లో సోమవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ (కేపీ) ప్రారంభించారు. కాగిత మాట్లాడుతూ పింఛన్‌దారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని ఒకే సారిగా అమలు చేశామని కాగిత పేర్కొన్నారు. నాగాయలంకలో ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, గ్రామ కార్యదర్శి జరుగు పవన్ కుమార్ పర్యవేక్షణలో సర్పంచి కైతేపల్లి అంకాలు, ఉప సర్పంచ్ నాని కార్యక్రమం ఆరంభించి పింఛన్‌లు అందజేశారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. పెదప్రోలు గ్రామంలో జెడ్పీటీసీ మెడబలిమి మల్లిఖార్జునరావు చేతులమీదుగా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రతిగ్రామంలో గ్రామ సచివాలయ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండల పరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు నడకుదుటి జనసీకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, సర్పంచ్‌లు చింత శ్రీనివాసరావు, పాలిమెట్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలో 13 పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విశ్వనాథపల్లిలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. మెరకగౌడపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి టీడీపీ నేతలు క్షీరాభిషేకం చేశారు.

మండలంలో 96.80 శాతం పింఛన్ల పంపిణీ

కోడూరు: మండలంలో తొలిరోజే 96.80 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి అయినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి 7,380 పింఛన్లు ఉండగా 7,144 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించినట్లు చెప్పారు. వీరికి రూ.4.76 కోట్ల నగదును పంపిణీ చేశామన్నారు. మంగళవారం కూడా పింఛన్ల పంపిణీ ఉంటుందని, పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ కోరారు.

ఘంటసాల: మండలంలో 13 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే ఆయా లబ్ధిదారులకు ఉద్యోగులు, నాయకులు, సర్పంచులు పింఛన్లను అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడితో అసహనానికి గురైన ఉద్యోగులు

పనిచేయని సర్వర్లు

ఘంటసాల: వలంటీర్లు లేకపోయిన నూరుశాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పుకోవడానికి అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయాలని సచివాలయం పరిధిలోని ఒక్కో ఉద్యోగికి 50 మందిని కేటాయించారు. ఆయా సచివాలయాల్లో జనాభాను బట్టి సచివాలయంతో పాటు పంచాయతీ ఉద్యోగులను నియమించారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇచ్చినట్లే ప్రస్తుత ప్రభుత్వం వలంటీర్లు లేకపోయినా పింఛన్లు నూరు శాతం ఒక్కరోజులోనే పంపిణీ చేసినట్లు గొప్పలు చెప్పుకోవడానికి సోమవారం ఉదయం 6గంటల నుంచి పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ అంతర్గతంగా తెల్లవారుజామునే నుంచే పింఛన్లు పంపిణీ ఇవ్వాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

సర్వర్లు పనిచేయక..

కొద్దిసేపు సవ్యంగా సాగిన పింఛన్ల పంపిణీ ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో సుమారు మూడు గంటల పాటు సర్వర్ ఇబ్బంది పెట్టడంతో ఆలస్యమైంది. దీంతో నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలని తీవ్రమైన ఒత్తిడి తేవడంతో పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం ఆరు గంటలు దాటినా లక్ష్యాలను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు చెప్పడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన మహిళా ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు.

95.30 శాతం పంపిణీ..

మండలంలో 95.30 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ తెలిపారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 7,215 మంది పింఛనర్లు ఉండగా 6,873 మందికి పింఛన్లు ఇచ్చి, 95.30 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు.

డయేరియా నివారణకు సహకరించండి


ములపర్రు గ్రామంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

బంటుమిల్లి: డయేరియా, అంటువ్యాధుల నివారణకు ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని బంటుమిల్లి, పెదతుమ్మిడి వైద్యాధికారులు సౌందర్య, జయశ్రీ పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు జరగనున్న స్టాప్ డయేరియా మాసోత్సవాల కార్యక్రమాలు గ్రామ, గ్రామాన వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా డయేరియా, డెంగీ, మలేరియా తదితర అంటువ్యాధుల నివారణపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ అంటువ్యాధుల కారణంగా 5 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ ఉంచవద్దని, పనికిరాని తొట్లు, పాత టైర్లు, కొబ్బరి డిప్పల తదితర వాటి ద్వార దోమలు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు భోజనం ముందు, తర్వాత బాత్ రూము ఉపయోగించిన అనంతరం చేతులు ఏలా శుభ్రం చేసుకోవాలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. నెలాఖరు వరకు నిర్వహించే మాసోత్సవాల విజయవంతానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని వైద్యులు కోరారు. బంటుమిల్లి, ములపర్రు సర్పంచ్‌లు వి.కృష్ణవేణి, బి.మంగమ్మ, వైస్ ఎంపీపీ ఓ.చిన్నారిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.వీరబాబు, పార్లమెంటు లీగల్ సెల్ కన్వీనరు ఏ. రంగనాదు, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, దాసు, శారదాంబ, భగవాన్, రైతు సంఘ నాయకుడు బి.నాగరాజు, కొండలరావు ఆయా గ్రామాల రైతులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ సూచనలు పాటించాలి


సీతాయిలంకలో డయేరియాపై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సూచనలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులు, డయేరియా రాకుండా నిరోధించవచ్చని శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని సీతాయిలంక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డయేరియా నిర్మూలన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో సీజనల్ వ్యాధులు, డయేరియాపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డయేరియా నిరోధక చర్యల పోస్టర్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. వేకనూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.రాహుల్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోదుమూడి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జన్ను స్నేహ, మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, న్యాయవాది కర్రా సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు మేడికొండ విజయ్, నీలా మనోహర్, ఎం.ఎల్.హెచ్.పీ మౌనిక, భార్గవి, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతికి ఎమ్మెల్యే నివాళి



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల వైఎస్సార్ సీపీ సీనియర్ ఎస్సీ నాయకుడు లంక రాజబాబు అలియాస్ రాజు (52) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఆయన స్వగృహం వద్ద మరణించారు. చల్లపల్లిలో ఆయన మృతదేహాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాజు మరణం వైఎస్సార్ సీపీకి తీరని లోటని సింహాద్రి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, జుజ్జువరపు భాగ్యారావుతో పాటు పలువురు నాయకులు రాజు మృతదేహానికి నివాళులర్పించారు.

పండ్ల తోట సాగుకు సబ్సిడీని వినియోగించుకోవాలి



కోసూరువారిపాలెం(మోపిదేవి): పండ్ల తోటలపై ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలని గ్రామ సచివాలయ వ్యవసాయశాఖ సహాయకులు శ్రీజ సూచించారు. మండలంలోని కోసూరువారి పాలెంలో గ్రామ సర్పంచి కోసూరు అనూష అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ మాట్లాడుతూ ఉద్యాన శాఖ పంటలు, ఉపాధిహామీ పథకం ద్వారా పండ్లతోటల సాగు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. వీఆర్వో మోపిదేవి వెంకటేశ్వరావు, పంచాయతీ కార్యదర్శి షహనా, వెల్ఫేర్ అసిస్టెంట్ భూపతి కుటుంబరావు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కోసూరు రాజ్యలక్ష్మి, అంగనవాడీ కార్యకర్త నవ్యశ్రీ, కోసూరు శివనాగమల్లేశ్వరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆలయానికి వంట పాత్రల సమర్పణ


ఆలయానికి వంట పాత్రలు అందజేసిన దాతలు, కుటుంబ సభ్యులు

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కొలువైన శ్రీపోతురాజుస్వామి ఆలయానికి సోమవారం దాతలు రూ.24 వేలు విలువైన వంట పాత్రలను బహూకరించారు. ప్రతి ఆదివారం ఆలయ ప్రాంగణంలో పేదలకు అన్న ప్రసాద వితరణ జరుగుతున్న నేపథ్యంలో స్పందించిన దాతలు గడ్డిపాటి సూర్యనారాయణ(లాంచీ సూరయ్య), రామకోటేశ్వరమ్మ దంపతుల /జ్ఞాపకార్థం వారి కుమారులు వేణుగోపాలరావు (లాంచీ చిన్న) శ్రీనివాసరావు (బుజ్జి) ఆర్థిక సౌజన్యంతో వీటిని సమకూర్చారు. దాతల చేతుల మీదుగా పాత్రలను ఆలయ అన్నదాన కమిటీ ప్రతినిధులకు అందజేశారు. తొలుత దాతలు కుటుంబ సభ్యులతో కలసి పోతురాజుకు విశేష పూజలు జరిపి పాత్రలను ఆలయానికి సమర్పించారు. అనంతరం వారి ఆర్థిక సౌజన్యంతో 150 మంది పేదలకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గడ్డిపాటి నాగేశ్వరరావు, అన్నదాన నిర్వాహక కమిటీ ప్రతినిధులు, సేవా కార్యకర్తలు ఉప్పల బుజ్జి, తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఉప్పల సత్యనారాయణ (సత్యం), గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి సత్కారం

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసి జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన వనమా రామకృష్ణను సోమవారం పాఠశాల విద్యా కుటుంబం ఆధ్వర్యంలో పాఠశాల ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. వక్కపట్లవారిపాలెం సర్పంచి అంబటి శ్యామ్‌ప్రసాద్ తదితరులు ఆయన సేవలను కొనియాడారు. హెచ్.ఎం పంద్రాజు ప్రసాద్ అధ్యక్షతన అభినందన సభ జరిగింది. తొలుత పాఠశాల ఉపాధ్యాయులు, తదుపరి సర్పంచి శ్యామ్ ప్రసాద్ దంపతులు ఉద్యోగ విరమణ పొందిన రామకృష్ణ, జయశ్రీ దంపతులను ఘనంగా సన్మానించారు. మండల ఆర్యవైశ్య సంఘం తరపున చిట్టా సాంబశివరావు, తాడికొండ సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య తదితరులు సత్కరించారు. పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం పీవీ నాగేశ్వరరావు, పీడీ గాజుల లక్ష్మీప్రసాద్, పద్యాల రఘురామ్, విశ్రాంత ఎంఈఓ పద్యాల నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని లక్ష్మీపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బస్వాని మహేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయగా సోమవారం వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా మహేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పలువురు రాజకీయ నాయకులు, స్థానికులు మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కాగిత విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ రత్నకుమారి, ఎంఈవో ప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు తులసీరావు, రంగారావు పాల్గొన్నారు.

పెడన: తోటమూల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మహమ్మద్ ఇస్మాయిల్ సన్మాన సభ పెడన ఫంక్షన్ హాల్ సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉన్నత విద్య విశ్రాంత అధికారి మట్టా రాధా కృష్ణమూర్తి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి వేలాది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దటమే కాకుండా ఉపాధ్యాయ లోకంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సాధించిన ఇస్మాయిల్ నేటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పెడన ఎంఈవో-2 హరినాథ్, ప్రధానోపాధ్యాయులు చింతలపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల సామూహిక అక్షరభ్యాసం


సామూహిక అక్షరాభ్యాం నిర్వహిస్తున్న దృశ్యం

మచిలీపట్నం టౌన్: స్థానిక పదో డివిజన్ సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, ఆశీర్వచనాల మధ్య మొదలైన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధార సీతామాలక్ష్మి సరస్వతీదేవికి పూజలు చేశారు. అనంతరం పాఠశాలలో చేరిన చిన్నారి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం పాఠశాలలో ప్రతి సంవత్సరం సరస్వతీ దేవి పూజ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు విద్యాభ్యాసం చేయించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థులలో చిన్నతనం నుంచే సంప్రదాయాలతో పాటు క్రమశిక్షణ కూడిన విద్యను అందించాలని అన్నారు. ఉపాధ్యాయురాలు లంక సునీత మాట్లాడుతూ అక్షరాభ్యాసం ప్రతి సంవత్సరం పాఠశాలలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శాంత కుమారి, అశ్విన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.


పాడి రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సాధించాలి


పెదప్రోలు సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ చైర్మన్ ఆంజనేయులు

పెదప్రోలు(మోపిదేవి): పాల ఉత్పత్తిదారులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సాధించేలా కృషి చేయాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సూచించారు. మండలంలోని పెదప్రోలు పాలసేకరణ కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం సంఘ అధ్యక్షుడు నాదెళ్ల భవాని శంకర్ ప్రసాద్ అధ్యక్షతన పాల ఉత్పత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినరల్ మిక్చర్, క్యాల్షియం, వాతం పాడి, పశువులకు మేలు జాతి వీర్యం ఉపయోగించాలని వివరించారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు గొళ్ల పూర్ణమల్లిఖార్జునరావు, పామర్రు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్, రూట్ సూపర్‌వైజర్ ఎం.వరప్రసాద్, సంఘ సిబ్బంది కె. రాము, డి.చిన్న అర్జునరావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

గుడివాడ టౌన్: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కౌన్సిల్ సభ్యులు జి.బాబూ శ్రీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ స్థానిక ఏఎన్నార్ కళాశాల విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో మొత్తం 46 మంది నుంచి రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు, కోశాధికారి ఎస్.ప్రసాదు, ఉపాధ్యక్షుడు వై. సుహాస్ పాల్గొన్నారు.





ఆర్మీ జవాన్ నాగరాజుకు నివాళి

సైనిక విన్యాసాల్లో తూర్పు లద్దాఖ్ ఎల్ఏసీ సమీపంలోని నదిలో యుద్ధట్యాంక్ మునిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ఆర్మీ జవాన్ సాదరబోయిన నాగరాజు (32) అంత్యక్రియలు మండలంలోని చేవేంద్ర గ్రామంలో సైనిక లాంఛనాలతో సోమవారం నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి, పలువురు అధికారులు, భారీగా తరలి వచ్చిన ప్రజలు జోహార్లు అర్పించారు.
-పెడన

క్లుప్తంగా

రామలింగేశ్వర స్వామికి విశేష పూజలు



నాగాయలంక: జ్యేష్ఠ దశమి పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాద క్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి మండపంలో శివలింగానికి సోమవారం భక్తులు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి ప్రసన్న గణపతి దేవస్థానం ప్రధాన అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీరామలింగేశ్వరునికి జరిగిన పూజలు, విశేష అలంకారం భక్తులను అలరించింది. తొలుత క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులు సామూహిక పూజలు జరిపి శివలింగానికి పసుపు, కుంకుమ, విభూది, నారికేళ, గోక్షీరం తదితర పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి నదీ జలంతో శివయ్యను స్వయంగా అభిషేకించుకున్నారు. తదుపరి రామలింగేశ్వరునికి, నందీశ్వరునికి శాస్త్రోక్తంగా మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించారు.

గాయపడిన సచివాలయ ఉద్యోగి



మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి గ్రామ సచివాలయ కార్యదర్శి పంద్రాజు మోహనకృష్ణ సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఉదయం సామాజిక పింఛన్లు పంపిణీ చేసి ద్విచక్రవాహనంపై వస్తుండగా మెరకనపల్లి అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోహనకృష్ణ రోడ్డుపై పడిపోయాడు. కంటి పక్కన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి 43 కంప్యూటర్లు



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.22 లక్షల నిధులతో 43 హెచ్‌పీ కంపెనీ కంప్యూటర్లు వచ్చినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ నుంచి వీటిని అందించగా సోమవారం కళాశాలకు చేరినట్టు చెప్పారు. బీఎస్సీ, కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్ విద్యార్థులు ఈ కంప్యూటర్ ల్యాబ్‌ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ కోర్సులను నేర్చుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న జరిగే బంద్‌ను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: నీట్ నెట్ పరీక్షల పేపర్ లీకేజ్‌ను నిరసిస్తూ భారత్ విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 4న జరగనున్న బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. సమరం పిలుపునిచ్చారు. దేశ గౌరవ ప్రతిష్ఠలకు నిదర్శనమైన నీట్ పరీక్షల్లో చరిత్రలో ఏనాడూ లేనివిధంగా అవకతవకలు జరగడం శోచనీయం అన్నారు. ఈ పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని బాధిత విద్యార్థులు విద్యాశాఖా మంత్రికి విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. నష్టపోయిన విద్యార్థులకు పరిహారం చూపాలని కోరుతూ చేపట్టిన ఈ సమ్మెను ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

పరిశోధన సహాయకుడి ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు: కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రుసా) నిధులతో చేపలపై పరిశోధన నిమిత్తం సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జంతుశాస్త్ర అధ్యాపకులు, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ మేకల విజయకుమార్ సోమవారం తెలిపారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో డిసెంబరు 2020లో అకస్మాత్తుగా వందలాది ప్రజలు ఒక అంతుచిక్కని వ్యాధికి గురయ్యారని పేర్కొన్నారు. ఆ సమయంలో చేపల వినియోగంలో భారీ ఖనిజ అహార అవశేషాలు ఉన్నట్లు గుర్తించి నివేదించగా, పూర్తి పరిశోధనకు అవకాశం కల్పించారని తెలిపారు. పరిశోధన నిమిత్తం సహాయకుడిగా పనిచేయడానికి ఒకరు అవసరమవుతారని పేర్కొన్నారు. ఎంఎస్సీ జువాలజీ లేదా ఆక్వాకల్చర్, ఫిషరీస్‌లో కనీసం 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు గౌరవ వేతనం కింద రూ.12,000 అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వారం రోజుల్లోపు కైకలూరు కాలేజీలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు లెక్చరర్ విజయకుమార్‌ను 94900 86886లో సంప్రదించాలని పేర్కొన్నారు.